క్లుప్తంగా

పల్లకోత్సవంలో పాల్గొన్న కాటసాని



పల్లకోత్సవంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని కర్నూరు అర్బన్‌లోని 21, 32, 41వ వార్డులలో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నంద్యాలజ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల పల్లకీ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ విభాగం అధ్యక్షురాలు (కార్పొరేటర్) గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు యూనిస్‌బాషా, సుకుమార్, ప్రతాపరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గంగులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర



శ్రీరాముని విగ్రహంతో శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: తెలుగు వీధి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని ఆదివారం శ్రీరాముడి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. తెలుగు వీధి, రంగరాజువీధి, మెయిన్‌బజార్, పూలబజార్, చౌక్ బజార్, గడియారం ఆస్పత్రి, మించిన్ బజార్, బొంగుల బజార్ మీదుగా తెలుగు గేరి వరకు ఊరేగింపు జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ, బజంరగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆదోని బార్ అసోసియేషన్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదోని బార్ అసోసియేషన్ ఘన విజయం సాధించింది. ఆదివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మైదానంలో ఆదోని, కర్నూలు బార్ అసోసియేషన్‌ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆదోని జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదోని బార్ అసోసియేషన్ 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 80 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. విజేతలకు ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గురూజీ -దృష్టి దార్శనికత పుస్తక సమీక్ష

కర్నూలు కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో గురూజీ -దృష్టి దార్శనికత పుస్తక సమీక్ష ఆదివారం వినాయక్ ఘాట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. భరతమాత చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ మాట్లాడుతూ.. మాధవ గీత ఆధారంగా తెలుగులో అనువదించబడిన శ్రీ గురూజీ పుస్తకం ఆదర్శ వ్యక్తిత్వాన్ని అందరికీ అందించిన గ్రంథమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యకారిణి సదస్యులు డాక్టర్ ఖాదరబాద్ ఉదయ శంకర్, పుస్తక రచయిత రంగా హరి, ఇతిహాస సంకలన సమితి తెలంగాణ ప్రాంత కార్యదర్శి అనువాదకులు వేదుల నరసింహం మాట్లాడారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు రామశర్మ, సభ్యులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి



ఈస్టర్, గుడ్ ఫ్రైడే పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కోల్స్ చర్చి పాస్టర్లు అనిల్, జీవన్ రావు

కర్నూలు (టౌన్): గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహిద్దామని కోల్స్ చర్చి పాస్టర్లు అనిల్ శామ్యూల్, జీవన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఈస్టర్, గుడ్‌ఫ్రైడే పండుగలకు సంబంధించిన పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగను, అలాగే మట్టల ఆదివారం నిర్వహించాలన్నారు. చర్చి అధ్యక్షుడు అబ్రహాంలింకన్, శాంసన్ పాల్, లక్ష్మన్న, జాన్ విల్సన్ పాల్గొన్నారు.

జగదభి రామ.. దశరథ రామ

- కమనీయం రాములోరి కల్యాణం
- శ్రీరామ నామ సంకీర్తనలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పానకం, పెసరపప్పు అన్నప్రసాదాల పంపిణీ



పాల్గొన్న భక్తులు



సూర్యాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో శ్రీరామనవమి వేడుకలు కమనీయంగా జరిగాయి. ఆదివారం నగరంలోని శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల సవ్వళ్లు, భక్తుల శ్రీరామ నామ జపం, కోలాటాలు, భజనలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నిండింది. పండితులు శ్రీరామ పర్వదినం విశిష్టతను వివరించారు. స్వామివారికి అభిషేకాలు, పల్లకీ సేవ, రథోత్సవం, ఉత్సవమూర్తుల ఊరేగింపు, చందనోత్సవం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడపప్పు, పానకం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మంత్రి టీజీ భరత్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి నగరంలోని పలు ఆలయాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు.

➤ బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఈఓ ఆదిజంబులమ్మ, రంగాపురం మద్దిలేటి స్వామి ఆలయ ఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

➤ వీఆర్ కాలనీ రామలింగేశ్వర్ నగర్‌లోని పార్క్‌లో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

➤ శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కల్యాణ మండపంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

➤ వీఆర్ కాలనీ చిన్మయ మిషన్ కేంద్రంలో జరిగిన వేడుకల్లో స్వామిని సుప్రేమానంద సరస్వతి సందేశమిచ్చారు. చిన్మయ మిషన్ సభ్యులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

➤ అశోక్‌నగర్ ప్రసన్న ఆంజనేయ స్వామి, ద్వారకామాయి సాయిబాబా దేవస్థానంలో జరిగిన వేడుకల్లో మర్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

➤ స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

➤ ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

➤ సంకల్‌బాగ్‌లో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ దంపతులు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ దంపతులు పాల్గొన్నారు.

➤ గణేష్‌నగర్ అభయ ఆంజనేయ స్వామి, సోమనాథేశ్వర స్వామి ఆలయం, నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరం, శరీన్ నగర్ సద్గురు త్యాగరాజ సీతారామాలయం, కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం, బుధవారపేట ఈశ్వర ఆంజనేయ స్వామి ఆలయం, కొత్తపేట కోదండ రామాలయం, శ్రీరామనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలు, ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం, తెలుగు గేరిలోని చిన్న ఆంజనేయ స్వామి దేవాలయం, రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, వడ్డెగేరిలోని కోదండ రామాలయం, గోశాల, పేట ఆంజనేయస్వామి ఆలయం, మారుతి నగర్‌లోని మారుతి రామేశ్వర ఆలయం, ఓల్డ్ సిటీలోని దండేగేరి సీతారామాలయం, ఇస్కాన్ మందిరం, సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల ఈఓలు, ఆయా ఆలయాల కమిటీలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



కవాడీ వీధిలో పూజల్లో ఎస్వీ మోహన్ రెడ్డి దంపతులు



పాల్గొన్న భక్తులు



అశోక్ నగర్‌లో కల్యాణం



చిన్మయ మిషన్ వేడుకల్లో స్వామిని సుప్రేమానంద తదితరులు



కొత్తపేట రామాలయంలో అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులు



సూర్యాలయంలో కల్యాణ మూర్తులను ఊరేగిస్తున్న పండితులు



కల్లూరు ఎస్టేట్ పంచముఖి ఆలయంలో కల్యాణోత్సవం



లలితా పీఠంలో కల్యాణమూర్తులుగా సీతారాములు



వీఆర్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మూర్తులు



శరీన్ నగర్ త్యాగరాజ స్వామి ఆలయంలో..



కొత్తపేట రామాలయంలో..



రాంబొట్ల ఆలయం మూలమూర్తులు



సూర్యనారాయణ స్వామి ఆలయంలో..

కమనీయం.. సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: శ్రీరామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆదివారం స్థానిక దామోదరం సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య సీతారాముల కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. పండితులు కల్లె వేణుగోపాల్ శర్మ వ్యాఖ్యానం చేశారు. కర్నూలు పేద జిల్లా నుంచి ఐశ్వర్యవంతమైన జిల్లాగా ఎదగాలనే సంకల్పంతో లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొని ప్రసంగించారు. కర్నూలు శ్రీరామ కల్యాణ ఉత్సవ సమితి అధ్యక్షుడు కె.క్రిష్ణన్న, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు ఎస్వీ నారాయణరెడ్డి, టీసీ మద్దిలేటి, జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): స్థానిక 44వ వార్డు సీతారామ నగర్‌లోని పార్కులో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, శేషాద్రి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, నాగేశ్వరరావు, అమర్నాథ్, సంపత్, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్టాండ్ చెన్న కేశవ స్వామి ఆలయంలో... స్థానిక పాతబస్టాండ్ చెన్న కేశవ ఆలయంలో వలసింగం రెడ్డి శ్రీనివాసులు బ్రదర్స్, లక్ష్మీ నారాయణ, రాముడు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.











సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు హోమంలో పాల్గొన్న మంత్రి భరత్, ఎంపీ నాగరాజు తదితరులు, సీతారామ నగర్‌లో పూజల్లో పాల్గొన్న తెర్నేకల్ సురేందర్ రెడ్డి, చెన్నకేశవ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

‘చెమట చెక్కిన వాక్యం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ రచించిన కవిత్వ పరామర్శ ‘చెమట చెక్కిన వాక్యం’ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయ సారథి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విరసం సభ్యులు పాణి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఎం.ప్రగతి, తెలుగు కళా స్రవంతి అధ్యక్షుడు ఇనాయతుల్లా, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య వక్తలుగా హాజరై ప్రసంగించారు. విమర్శలో వైవిధ్యమైన గ్రంథం చెమట చెక్కిన వ్యాకం అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు నాగమణి, ఎస్‌డీవీ అజీజ్, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పార్వతయ్య, పుల్లా రామాంజనేయులు, బసవరాజు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు స్థానిక కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

అత్యాధునిక పద్ధతుల్లో గుండె ఆపరేషన్లు



డాక్టర్ పీఎస్ఎస్ లక్ష్మణస్వామిని సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఆధునిక పద్ధతుల్లో గుండె ఆపరేషన్లు అందుబాటులోకి వచ్చినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ పీఎస్ఎస్ లక్ష్మణస్వామి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో గుండె జబ్బులున్న వారికి ఆపరేషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. బైపాస్, వాల్వ్ రీప్లేస్‌మెంట్, కోత తక్కువగా ఉండే మినిమల్ ఆపరేషన్ల గురించి వివరించారు. ఆపరేషన్ ఎవరికి అవసరం, ఎందుకు అవసరం, ఆపరేషన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో గుండెజబ్బులతో బాధపడే వారి సంఖ్య మరింత పెరిగిందన్నారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం దీనికి కారణాలని, ఇటీవల వచ్చిన కోవిడ్-19 వల్ల కూడా రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. 40 ఏళ్ల దాటిన ప్రతిఒక్కరూ తరచూ వైద్యపరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆహారంలో పోషకాలు చేర్చుకోవాలని, తీపి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ తగ్గించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, దూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, సభ్యులు నాగేశ్వరబాబు, లక్ష్మన్న, వాసుదేవమూర్తి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 7న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. జిల్లా పరిషత్ సబ్ స్టేషన్ పరిధి, షరాఫ్‌బజారు, ఓల్డ్ కంట్రోల్ రూము ఏరియా, కిడ్స్ వరల్డ్ పార్క్, వడ్డెగేరి, కడక్‌పురా, గౌలిగేరి ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

కర్నూలు (టౌన్): నగరంలో ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించే పన్నుదారులకు 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు అర్ధ సంవత్సరాల పన్నులను ఈనెల 30వ తేదీలోపు చెల్లించిన పన్నుదారులకు ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. నగర పాలక కార్యాలయంలో, మీసేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో, స్థానిక సచివాలయాల్లో పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

లొద్దిపల్లెలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ నెల 18న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎస్ఐ సునీల్ కుమార్ ప్రారంభించారు. పోటీలకు మొత్తం 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి రెండు స్థానాలకు గాను రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించాలన్నారు. సంఘస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓకు వినతి



డీఈఓ శ్యామూల్ పాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆదివారం పది పరీక్షల మూల్యాంకన కేంద్రంలో ఎస్టీయూ నాయకులు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి మాట్లాడుతూ డీఎస్సీ 2012 ద్వారా జాయిన్ అయిన ఎస్‌జీటీలకు జాయినింగ్ తేదీలు వివిధ మండలాల్లో వేరు వేరుగా ఎస్ఆర్‌లో నమోదు చేశారన్నారు. కావున 2012 డీఎస్సీ ఎస్‌జీటీలందరికి ఒకే జాయినింగ్ తేదీ ఇవ్వాలన్నారు. జిల్లావ్యాప్తంగా కోవిడ్-19 సమయంలో వివిధ విభాగాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు నమోదు కొరకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 2002లో చేపట్టిన ఎస్‌జీటీల నుంచి ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారిలో సీనియారిటీ విషయంలో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు సుంకన్న, రామచంద్ర, భాస్కర్, విక్టర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రావి, వేప చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్



రవాణాకు సిద్ధంగా ఉన్న చెట్టు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరం క్రిష్ణానగర్‌లో దాదాపు ఐదు దశాబ్దాల చెట్లను మరోచోట అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రిష్ణానగర్‌లో బిల్డరొకరు ఒక పాతబడిన ఇంటిని తొలగించి కొత్త భవనం నిర్మించ తలపెట్టారు. ఈ ఇంటి ప్రాంగణంలో ఒక రావి చెట్టు, వేప చెట్టు ఉన్నాయి. భవనం కట్టాలంటే ఈ చెట్లను పూర్తిగా తొలగించాల్సి ఉంది. పచ్చని చెట్లను అలా తొలగించడం ఇష్టం లేక మరో చోట ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని తలపెట్టారు. ఈ.తాండ్రపాడుకు చెందిన రమేష్‌గుప్తా తన పొలంలో ఉన్న గుడి, గోశాల దగ్గర ఈ చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుకు వచ్చారు. దీంతో కొద్ది రోజుల క్రితమే ఈ చెట్ల కొమ్మలు తొలగించారు. విశ్రాంత డీఎఫ్‌వో జయచంద్రారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, కర్నూలు నగర పర్యావరణ సంరక్షణ విభాగ్ అధ్యక్షుడు తోట హరికృష్ణలు బిల్డరు సహకారంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. రెండు చెట్లను ఆరేడు అడుగుల లోతులో ఉన్న వేర్ల వరకు క్రేన్ ద్వారా తవ్వారు. వీటిని ఈ.తాండ్రపాడుకు తరలించి రమేష్ గుప్తా పొలంలో ఏడు అడుగుల లోతులో నాటి సారవంతమైన మట్టి, నీళ్లు, వివిధ రకాల పోషకాలతో చెట్లనునాటుతారు. ఎండాకాలమైనందున రోజూ నీళ్ల పెడుతూ ఉంటే కొద్ది రోజుల్లో చిగుళ్ల వస్తాయని విశ్రాంత డీఎఫ్‌వో తెలిపారు. ఇవి పూర్వపు చెట్ల మాదిరిగా పెరుగుతాయని తెలిపారు. చెట్లను పూర్తిగా నరికి వేయకుండా మరో చోట నాటేందుకు ప్రయత్నిస్తే పర్యావరణానికి ధోకా ఉండదని తెలిపారు. ఇది తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని పేర్కొన్నారు.